సాక్షి జోగుళాంబ గద్వాల

బుధవారం । 25 । అక్టోబర్ । 2023



కందనూలు ఎవరికో..

నాగర్‌కర్నూల్ నియోజకవర్గం 1952లో ఏర్పడగా.. అదే ఏడాది ఎన్నికలు నిర్వహించారు.

వివరాలు 10లో ►



రూ.5.10 లక్షల నగదు సీజ్

వనపర్తి, పేట జిల్లాల్లో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.5.10 లక్షల నగదు పట్టుబడింది.

వివరాలు 10లో ►

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.4 /21.0

రోజంతా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమవుతుంది. సాయంత్రం చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పదో పటాలంలో ఘనంగా ఆయుధ పూజ



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల పరిధిలోని బీచుపల్లి పదో పటాలంలో సోమవారం దసరా పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పటాలం కమాండెంట్ సాంబయ్య హాజరై పటాలంలోని ఆయుధాలకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జీవించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో పటాలం అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పంటలకు నీరు అందించండి



మానవపాడు: రైతుల పంటపొలాలు ఎండిపోతున్నాయని ఆర్డీఎస్ తుమ్మిల ద్వారా సాగు నీరు అందించాలని ఆర్డీఎస్ అధికారులకు ఎమ్మెల్యే వీ.ఎం అబ్రహం సూచించారు. సోమవారం మండల కేంద్రంలో రైతులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మానవపాడు, ఉండవెల్లి, వడ్డేపల్లి, రాజోలి గ్రామాల రైతుల మిరప పంటపొలాలు ఎండిపోతున్నాయని, సాగునీరు అందించాలని ఆర్డీఎస్ ఎస్సీ, డీఈ, సుంకేసుల ఎస్సీ, డీఈ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సుంకేసుల, తెలంగాణకు సంబంధించిన రెండు ఇన్‌డెంట్లను కలిపి టీబీ డ్యాంకు నివేదికలు అందించాలన్నారు. మానవపాడులో 20, 30, 31 డిస్ట్రిబ్యూటర్‌లకు నీరు అందించాలని, మిరప పంటకు ఎకరాకు రూ.1.30లక్షలకు పైగా పెట్టుబడులు పెట్టారన్నారు. రైతులకు త్వరగా నీరు అందించేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, వెంకట్రాములు, దామోదర్‌రెడ్డి, హుస్సేన్, కాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల్లో దసరా సంబరాలేవీ?



మానవపాడు: మిరప పంటలకు సాగునీరు అందక దాదాపు 20 వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఆరోపించారు. మండలంలోని డి–30 కాల్వను పరిశీలించి మాట్లాడారు. రైతులు నీటికోసం ఆరాటం పడుతుంటే.. అలంపూర్ నాయకులు సీట్ల కోసం పాకులాడుతున్నారని ఆరోపించారు. ఆర్డీఎస్ ఎస్సీ, డీఈలతో ఫోన్లో మాట్లాడి రైతులకు తుమ్మిల ద్వారా నీటిని విడుదల చేయాలని కోరారు. రైతుల గోసను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులు కష్టాల్లో ఉండగా.. దసరా పండుగ ఎలా జరుపుకొంటారని ప్రశ్నించారు. రైతులకు రెండు రోజుల్లో నీరు అందించకుంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జగన్మోహన్ నాయుడు, పరమేష్ నాయుడు, హుస్సేన్, భీమేశ్వర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● ష్.. గప్‌చుప్

గద్వాల రాజకీయం..

బీజేపీలో తెరపైకి కొత్త పేర్లు

- బీసీ వాదంతో అసెంబ్లీ ఎన్నికలకు..
- వాల్మీకి వర్గానికి చెందిన ఇద్దరు నేతల్లో ఒకరికి చాన్స్
- 66 ఏళ్లలో తొలిసారిగా పోటీలో లేని డీకే కుటుంబం
- నారాయణపేటలో పోటీ చేయాలని స్థానిక బీజేపీ శ్రేణుల విజ్ఞప్తి
- మహబూబ్‌నగర్ ఎంపీ బరిలో నిలిచేందుకే డీకే అరుణ ఆసక్తి





సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ మారుతున్న రాజకీయాలు ఆసక్తి రేపుతున్నాయి. విలక్షణ తీర్పునకు ప్రతీకగా నిలుస్తున్న గద్వాల నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు హాట్‌టాపిక్‌గా మారాయి. బీసీ వాదం బలంగా విన్పిస్తుండడంతో రాజకీయ పార్టీలు ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. బీఆర్‌ఎస్ అన్ని పార్టీల కంటే ముందస్తుగా అసెంబ్లీ అభ్యర్థులను ఖరారు చేసిన విషయం తెలిసిందే. పాలమూరు వ్యాప్తంగా సిట్టింగ్ ఎమ్మెల్యేలకే మళ్లీ పోటీ చేసే అవకాశం దక్కింది. ఈ మేరకు గద్వాల నుంచి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బరిలో నిలవనున్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ అభ్యర్థిగా జెడ్పీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య ఖరారు కాగా.. నడిగడ్డ హక్కుల పోరాట సమితి కన్వీనర్ రంజిత్‌కుమార్ ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పోటీ చేయనున్నారు. కాంగ్రెస్, ఏఐఎఫ్‌బీ నుంచి పోటీ చేస్తున్న ఈ ఇద్దరు బీసీ నేతలు కాగా.. బీజేపీ సైతం ఇక్కడి నుంచి ఆ సామాజిక వర్గానికి చెందిన నేతనే బరిలో నింపేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే గద్వాల నియోజకవర్గ చరిత్రలో డీకే కుటుంబం పోటీకి దూరంగా ఉండడం చర్చనీయాంశంగా మారింది.

తెర మీదకు వాల్మీకి నాయకులు..

గద్వాలలో కాంగ్రెస్, ఏఐఎఫ్‌బీ నుంచి పోటీ చేస్తున్న నేతలు కుర్వ వర్గానికి చెందిన బీసీ నేతలు కాగా.. ఈ నియోజకవర్గంలో అత్యధిక ఓటు బ్యాంక్ కలిగిన వాల్మీకి వర్గానికి చెందిన బీసీ నేతలను బీజేపీ నుంచి బరిలో దింపేలా ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు రెండు రోజులుగా డీకే బంగ్లాలో పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమాలోచనలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి, వీరుబాబు, వైండింగ్ రాములు పేర్లు తెర మీదకు వచ్చాయి. పోటీ చేసేందుకు కృష్ణవేణి విముఖత చూపుతుండగా.. వీరుబాబు, వైండింగ్ రాములలో ఒకరిని ఫైనల్ చేసే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. అయితే గత ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసిన వెంకటాద్రిరెడ్డి తోపాటు సంగాల అయ్యప్పరెడ్డి సైతం టికెట్ కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. కాగా, డీకే అరుణను నారాయణపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని స్థానిక బీజేపీ శ్రేణులు కోరినట్లు తెలిసింది. ఆమె సూటిగా సమాధానం చెప్పకున్నా.. రానున్న ఎన్నికల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

అత్యధిక ఓట్లు వాల్మీకి బోయలవే..

గద్వాల అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,53,869 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో సుమారుగా 58 వేల మంది వాల్మీకి బోయలు, 42 వేల మంది కుర్వ, గొల్ల, 32 వేల మంది ఎస్సీలు (మాదిగ, మాల), 20 వేల మంది ముస్లింలు, 15 వేల మంది ముదిరాజ్‌లు, 16 వేల మంది మున్నూరు కాపు వర్గానికి చెందిన వారు ఉన్నారు. పద్మశాలీలు 4 వేలు, గౌడ్‌లు 14 వేలు, మంగలి 4 వేలు, ఆర్యవైశ్యులు 5 వేలు, రెడ్డిలు 10 వేలు, లంబాడీలు 7 వేలు, బ్రాహ్మణులు 2 వేలు, చాకలి 6 వేల మందితో పాటు కుమ్మరి, ఉప్పరి, కమ్మరి, వడ్రంగి, స్వకుల శాలి, ఆరెకటిక, వడ్డెర తదితర కులాలకు చెందిన వారు ఉన్నారు. ఇందులో 65 శాతానికిపైగా బీసీలే ఉండగా.. రాజకీయంగా శాసించగలిగే స్థితిలో ఉన్నారు. 1957 నుంచి ఇప్పటివరకు 15 పర్యాయాలు ఎన్నికలు జరగగా.. 1999లో వెనుకబడిన వర్గానికి చెందిన గట్టు భీముడు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తాజాగా బీసీ వాదం తెరపైకి వచ్చిన క్రమంలో ఆ వర్గానికి చెందిన వారినే అసెంబ్లీ బరిలో దింపాలని బీజేపీ యోచిస్తోంది. ఈ మేరకు అత్యధికంగా ఓటు బ్యాంక్ ఉన్న వాల్మీకి బోయ వర్గానికి చెందిన నాయకుడికి ఈ సారి చాన్స్ ఇవ్వనున్నట్లు సమాచారం.

66 ఏళ్ల చరిత్రలో ఇదే తొలిసారి..

గద్వాల రాజకీయాలకు కేరాఫ్‌గా డీకే కుటుంబం నిలుస్తోంది. 1957లో తొలిసారిగా ఎమ్మెల్యేతో మొదలైన డీకే కుటుంబం జిల్లా, రాష్ట్ర రాజకీయాల్లో ఎన్నో ఎత్తుపల్లాలను చవిచూసింది. అయినా ఏనాడూ రాజకీయాలకు, పోటీకి దూరంగా ఉండలేదు. అలాంటిది ఈసారి తొలిసారిగా శాసనసభ ఎన్నికల్లో పోటీలో ఉండడం లేదనే అంశం హాట్‌టాపిక్‌గా మారింది. సంస్థాన అనంతరం జరిగిన ప్రజాస్వామ్యయుత ఎన్నికల్లో 1957లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో డీకే సత్యారెడ్డి ఇండిపెండెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ నుంచి పోటీ చేసి పాగ పుల్లారెడ్డిపై గెలుపొందారు. అలా డీకే కుటుంబం రాజకీయ ప్రస్థానం మొదలు కాగా.. 1962, 1967, 1972 ఎన్నికల్లో డీకే సత్యారెడ్డి ఓటమి చెందారు. ఆ తర్వాత 1978లో డీకే సత్యారెడ్డి విజయం సాధించారు. ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 1980లో ఆయన అకాల మృతి చెందారు. దీంతో ఆయన పెద్ద కుమారుడు డీకే సమరసింహారెడ్డి రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన వరుసగా 1980, 1983, 1985 (కోర్టు తీర్పుతో), 1989 ఎన్నికల్లో గెలుపొందారు. అప్పటివరకు కలిసి ఒక్కటిగా ఉన్న అన్నదమ్ములైన డీకే సమరసింహారెడ్డి, డీకే భరత్‌సింహారెడ్డి మధ్య రాజకీయ విభేదాలు పొడచూపాయి. దీంతో డీకే సమరసింహారెడ్డి, డీకే భరత్‌సింహారెడ్డి 1994 ఎన్నికల్లో ప్రత్యర్థులుగా తలపడ్డారు. డీకే భరత్‌సింహారెడ్డి గెలుపొంది రాష్ట్రవ్యాప్తంగా ప్రాచుర్యం పొందారు. అనంతరం 1996 ఎన్నికల్లో డీకే భరత్‌సింహారెడ్డి సతీమణి డీకే అరుణ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. మహబూబ్‌నగర్ ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. 1999లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో గద్వాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అప్పట్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలో డీకే భరత్‌సింహారెడ్డి వర్సెస్ నాగం జనార్దన్‌రెడ్డి అన్నట్లు రాజకీయ ఆధిపత్యం కొనసాగేది. ఇలా వరుస ఓటములు, కష్టాలు చవిచూసినప్పటికీ రాజకీయాల్లో డీకే కుటుంబం ఏనాడూ వెనుకంజ వేయలేదు. 2004, 2009, 2014లో డీకే అరుణ వరుసగా గెలుస్తూ, మంత్రిగా రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పారు. కానీ ఎన్నికల్లో పోటీ చేయకుండా ఎన్నికల నుంచి దూరంగా ఉండడం ఇదే తొలిసారి.

హంస వాహనంపై జోగుళాంబ వైభవం





తెప్పోత్సవంలో ఆది దంపతుల నదీ విహారం, నదీ హారతి ఇస్తున్న అర్చకులు

- అశేష జనవాహిని మధ్య నదీ విహారం
- భక్తజనంతో పులకించిన పుష్కరఘాట్
- విద్యుత్ కాంతులతో వెలుగొందిన తుంగభద్ర

జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి హంసవాహనంపై తంగభద్ర నదీ విహారం వైభవంగా నిర్వహించారు. అశేషంగా తరలివచ్చిన భక్తజనం మధ్య ఆదిదంపతుల నదీ విహారం నయనానందకరంగా సాగింది. తుంగభద్ర నదిలో విద్యుద్దీప కాంతుల వెలుగులో సాగిన లోక రక్షకుల విహారం భక్తజనాన్ని కనురెప్ప వాల్చకుండా చేసింది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి తుంగభద్ర నదిలో తెప్పోత్సవాన్ని భక్తజనం అశేషంగా తరలివచ్చి వీక్షించారు.

– అలంపూర్/ జోగుళాంబ శక్తిపీఠం

అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర బలగాలు

ఎస్పీ రితిరాజ్

గద్వాల క్రైం/ అలంపూర్: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు జిల్లాకు కేంద్ర బలగాలు వచ్చాయని ఎస్పీ రితిరాజ్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలో కేంద్ర బలగాలకు ఏర్పాటు చేసిన వసతులను ఎస్పీ రితిరాజ్, జిల్లా అదనపు ఎస్పీ రవితో కలిసి సోమవారం పరిశీలించారు. కేంద్ర బలగాలకు కల్పించిన వసతిలో సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని అక్కడి పోలీస్ అధికారులను ఆదేశించారు. అనంతరం కేంద్ర బలగాల అధికారులతో ఎస్పీ, అదనపు ఎస్పీలు సమావేశమయ్యారు. కేంద్ర బలగాల అధికారులతో ఎన్నికల నిర్వహణపై చర్చించినట్లు తెలిపారు. వచ్చే నెల 30న అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని సూచించారు. పారామిలిటరి దళాల అధికారకు ఎన్నిక విధానంపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి జిల్లాకు 100 మందితో కూడిన కేంద్ర బలగాల బృందం వచ్చినట్లు తెలిపారు. జిల్లాకు మరిన్ని బలగాలు వస్తాయని పేర్కొన్నారు. జిల్లాలో 593 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కొన్ని సమస్యాత్మక కేంద్రాలను ఇప్పటికే గుర్తించినట్లు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు.



అలంపూర్ చౌరస్తాలో కేంద్ర బలగాల అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ రితిరాజ్

ప్రజలు సహకరించాలి..

జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంల్లోని ప్రజలంతా గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉన్నప్పుడే ఎన్నికలు సజావుగా కొనసాగుతాయన్నారు. వర్గభేదాలు లేకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలన్నారు. ఒకరికి ఒకరు కలిసిమెలిసి సామరస్యంగా ఉండాలన్నారు. ప్రజలు ఎన్నికల్లో పోలీసులకు సహకరించాలని కోరారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని ప్రయత్నించినా.. వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో కేంద్ర బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

ఎన్నికల నిర్వహణపై అప్రమత్తంగా వ్యవహరించాలి

గద్వాల క్రైం: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఐజీ చౌహాన్ అన్నారు. మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన విడియో కాన్ఫరెన్స్‌లో పలు విషయాలపై సిబ్బందితో మాట్లాడారు. గద్వాల జిల్లాలోని గద్వాల, అలంపూర్ సెగ్మెంట్‌లోని సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఎస్పీ రితిరాజ్‌కు వెల్లడించారు. వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలు, నేరాస్తుల కదలికలు ఎప్పటికప్పుడు గుర్తించాలన్నారు. నాయకుల సభలు, సమావేశాలు, ర్యాలీలు తదితర వాటిపై ఆరా తీయాలన్నారు. పోలింగ్ రోజు, కౌటింగ్ వరకు విధులపై సిబ్బంది నిర్లక్ష్యం వహించిన శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఏఎస్పీ రవి, సిబ్బంది ఉన్నారు.



జిల్లా కేంద్రంలో ఫ్లాగ్‌మార్చ్ చేపట్టిన పార మిలిటరి బలగాలు

పంటలు ఎండుతున్నా.. కరెంటిస్తలేరు



గద్వాలలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న కర్ణాటక రైతులు

గద్వాలలో కర్ణాటక రైతుల ఆందోళన

గద్వాల అర్బన్: పంటలు ఎండుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కరెంటు ఇవ్వడం లేదని కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లాకు చెందిన రైతులు మంగళవారం గద్వాల జిల్లా కేంద్రంలో ఆందోళన చేపట్టారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాయచూర్ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ధర్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. రైతులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక అమలు చేయడం లేదన్నారు. గత ప్రభుత్వం 12 గంటల విద్యుత్ అందించేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 3గంటలు సరఫరా చేస్తోందన్నారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి ఓట్లు వేసి గెలిపించామని, ఇప్పుడు చీకట్లో మగ్గుతున్నామన్నారు. విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నా కరెంటిస్తాలేరని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పదేళ్లగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన నివాసంలో మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న పల అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై గద్వాల, ధరూరు, మల్దకల్, కేటీదొడ్డి మండలాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరినట్లు తెలిపారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సత్యారెడ్డి, రమేష్‌రెడ్డి, రమేష్ నాయుడు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3 రోజుల్లో రూ.100కోట్ల విక్రయాలు

మహబూబ్‌నగర్ క్రైం: ఒకవైపు అసెంబ్లీ ఎన్నికలు..మరోవైపు దసరా పండగ.. దీంతో మూడు రోజుల నుంచి మద్యం దుకాణాలు జనాలతో కిటకిటలాడాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో చాలా వరకు నియోజకవర్గ కేంద్రాల్లో ప్రచారం ప్రారంభం చేసిన నేపథ్యంలో మద్యం అమ్మకాలు బాగా పెరిగాయి. ఉమ్మడి జిల్లాలో ఉన్న 290 మద్యం దుకాణాల్లో మూడు రోజుల్లో దాదాపు రూ.వంద కోట్ల వరకు మద్యం విక్రయాలు జరిగాయి. అత్యధిక అమ్మకాలు జడ్చర్ల, మహబూబ్‌నగర్, కొత్తకోట, గద్వాల ప్రాంతాల్లో జరిగాయి. మద్యం నిర్వాహకులు ముందస్తుగా తిమ్మాజిపేట, కొత్తకోట డిపోల నుంచి భారీగా మద్యం స్టాక్ తీసుకురావడం జరిగింది.

అంగరంగ వైభవంగా..


- జిల్లా వ్యాప్తంగా దసరా పండుగ
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు
- జోగుళాంబ అమ్మవారి ఆలయంలో ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు
- వేడుకల్లో పాల్గొన్న నేతలు

గద్వాల: జిల్లాలో విజయ దశమి(దసరా) పండుగను ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. పిల్లాపాపలతో జిల్లా ప్రజలు వేడుకగా పండుగను జరుపుకొన్నారు. శ్రవణ నక్షత్రం సంపూర్ణంగా ఉండటం, దశమి మధ్యాహ్నంతో ప్రారంభం కావడంతో సోమవారం దసరా వేడుకలను వైభవంగా జరుపుకొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అలంపూర్ జోగుళాంబ సన్నిధిలో దసరా శోభ ఉట్టిపడింది. జోగుళాంబ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు పూజలు ఘనంగా నిర్వహించారు. మల్దకల్ స్వయంభు లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం, పాగుంట వేంకటేశ్వర ఆలయం, చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయాల్లో దసరా వేడుకలను అత్యంత వైభవంగా చేపట్టారు. ఆలయాల వద్ద శమీపూజ, పల్లకీ సేవ నిర్వహించారు.



ధరూరులో జమ్మి చెట్టు వద్ద శమీ పూజలో పాల్గొన్న భక్తులు

ఉదయం ఇంటిల్లి పాదీ కొత్త దుస్తులు ధరించి ఆలయాలకు వెళ్లి పూజలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం జిల్లా కేంద్రంలోని గుంటి చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో చేరి పూజలు నిర్వహించారు. అక్కడే ఉన్న శమీవృక్షం(జమ్మిచెట్టు) చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం అక్కడికి వచ్చిన భక్తులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. స్థానిక కోటలోని చెన్నకేశవస్వామి ఆలయంలో 9 రోజుల పాటు పూజలందుకున్న స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు.



అలంపూర్‌లో శమి చెట్టుకు పూజలు నిర్వహిస్తున్న ఆలయ ఈఓ పురేందర్ కుమార్

వేడుకల్లో నేతలు..

దసరా వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ వేర్వేరుగా పాల్గొన్నారు. గుంటి చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శమీ వృక్షానికి సామూహికంగా హారతులు సమర్పించారు.

ప్రతిహామీ నెరవేరుస్తాం..

జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

ధరూరు: ఇచ్చిన హామీలు నెరవేరాలంటే కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, ఇందిరమ్మ రాజ్యం ప్రతిఇంట సౌభాగ్యం తెస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పేరులో నిర్వహించిన ప్రచారంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతుందన్నారు. మోసపూరిత మాటలకు మరోసారి మోసపోవద్దన్నారు. వచ్చే నెల 30న జరిగే ఓటింగ్‌లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామానికి చెందిన 200 మంది యువకులు సరిత తిరుపతయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ బండ్ల లక్ష్మీదేవి, నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, గంజిపేట శంకర్, నల్లారెడ్డి, షామీర్, మోతీలాల్, శ్రీకాంత్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, రంజిత్ గౌడ్, మల్లేష్, రమేష్ నాయుడు, నర్సింహ, విష్ణు, బాషా, రవి, పవన్, రాఖీ, అంజి పాల్గొన్నారు.



ఉప్పేరులో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సరిత

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో మంగళవారం 1,021 అడుగులకు నీటిమట్టం చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,108 క్యూసెక్కులు, సమాంతర కాల్వ నుంచి నీటి పంపింగ్‌ను నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ నుంచి వ్యవసాయ అవసరాలకు 1,150, కుడి కాల్వకు 15, ఎడమ కాల్వకు 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనిల్‌రెడ్డి తెలిపారు.

కందనూలు ఎవరికో..

అత్యల్ప, అత్యధిక మెజారిటీలు..

ఇప్పటి వరకు నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో అత్యధికంగా మెజారిటీ 54,354 ఓట్లు కాగా.. అత్యల్పంగా 52 ఓట్ల మెజారిటీగా నమోదైంది. 1983లో వీఎస్‌ గౌడ్‌ కాంగ్రెస్‌ పార్టీ తరఫున పోటీ చేయగా.. నాగం జనార్దన్‌రెడ్డి టీడీపీ తరఫున పోటీ చేశారు. ఇందులో వీఎస్‌ గౌడ్‌కు 22,342 ఓట్లు, నాగం జనార్దన్‌రెడ్డికి 22,290 ఓట్లు వచ్చాయి. దీంతో నాగంపై వీఎస్‌ గౌడ్‌ 52 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఇక 2018లో జరిగిన ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ నమోదైంది. బీఆర్‌ఎస్‌ తరఫున పోటీ చేసిన మర్రి జనార్దన్‌రెడ్డికి 1,02,493 ఓట్లు రాగా, కాంగ్రెస్‌ తరఫున పోటీ చేసిన నాగం జనార్దన్‌రెడ్డికి 48,139 ఓట్లు వచ్చాయి. దీంతో నాగంపై మర్రి జనార్దన్‌రెడ్డి 54354 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు.

నాగర్‌కర్నూల్‌: నాగర్‌కర్నూల్‌ నియోజకవర్గం 1952లో ఏర్పడగా.. అదే సంవత్సరంలో ఎన్నికలు నిర్వహించారు. నియోజకవర్గం ఏర్పడిన ప్రథమంలో తిమ్మాజిపేట మండలం జడ్చర్ల సెగ్మెంట్‌లో ఉండగా.. ప్రస్తుతం వనపర్తి జిల్లాలో ఉన్న గోపాల్‌పేట మండలం నాగర్‌కర్నూల్‌ నియోజకవర్గ పరిధిలో కొనసాగేది. నియోజకవర్గాల పునర్విభజనలో గోపాల్‌పేట మండలం వనపర్తిలో కలవగా.. తిమ్మాజిపేట మండలం నాగర్‌కర్నూల్‌ నియోజకవర్గానికి వచ్చింది. ప్రస్తుతం నియోజకవర్గ పరిధిలో నాగర్‌కర్నూల్‌, తెలకపల్లి, తాడూరు, బిజినేపల్లి, తిమ్మాజిపేట మండలాలు ఉన్నాయి. 2014 వరకు కాంగ్రెస్‌, టీడీపీలకు కంచుకోటగా ఉండగా.. 2014 ఎన్నికల్లో మొదటిసారి బీఆర్‌ఎస్‌ అభ్యర్థి మర్రి జనార్దన్‌రెడ్డి గెలుపొందారు. 2018లోనూ బీఆర్‌ఎస్‌ నుంచి విజయకేతనం ఎగురవేశారు. ఇక్కడి నుంచి నాగం జనార్దన్‌రెడ్డి ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం కాంగ్రెస్‌ నుంచి టికెట్‌ రాకపోవడంతో నాగం నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.

గెలుపోటములను ప్రభావితం చేసే అంశాలు..

నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధితోపాటు కుల ప్రాతిపదికన కూడా గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశం ఉంది. నియోజకవర్గంలో 48 శాతం ఓటర్లు బీసీ కులాలకు చెందిన వారే ఉన్నారు. కులాల వారీగా తీసుకుంటే యాదవులు, ముదిరాజ్‌లు, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు ఎక్కువ శాతం ఉన్నారు.

ఆరుసార్లు నాగం విజయం..

ఇప్పటి వరకు 16 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగగా.. ఆరుసార్లు నాగం జనార్దన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1983లో మొదటిసారి పోటీ చేసిన నాగం జనార్దన్‌రెడ్డి.. వీఎస్‌ గౌడ్‌ చేతిలో ఓటమి పాలయ్యారు. అనంతరం 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీచేసి గెలుపొందారు. తిరిగి 1989లో వంగ మోహన్‌గౌడ్‌ చేతిలో ఓటమిపాలయ్యారు. అనంతరం జరిగిన 1994, 1999, 2004, 2009, 2012 ఎన్నికల్లో గెలుపొందారు.

ఇప్పటి వరకు గెలిచిన ఎమ్మెల్యేలు

నాగర్‌కర్నూల్‌ నియోజవకవర్గం 1952లో ఏర్పడగా ఇదే సంవత్సరం ఎన్నికలు జరిగాయి. ద్విసభ కావడంతో ఇద్దరు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. బ్రహ్మారెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీ చేయగా ఆయనపై కాంగ్రెస్‌ తరఫున ఎ.రెడ్డి పోటీ చేశారు. ఇందులో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన బ్రహ్మారెడ్డి 17,402 ఓట్లతో గెలుపొందారు. మరో స్థానానికి రామస్వామి ఇండిపెండెంట్‌ అభ్యర్థిగా.. కాంగ్రెస్‌ తరఫున ఆశాదేవి పోటీ చేశారు. ఇందులో ఇండిపెండెంట్‌గా పోటీచేసిన రామస్వామి 14,099 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

గతంలో కాంగ్రెస్‌, టీడీపీకి ప్రాబల్యం

- ఇటీవల రెండు ఎన్నికల్లో గులాబీ జెండా రెపరెపలు
- ఆరుసార్లు ఎమ్మెల్యేగా నాగం ప్రాతినిథ్యం
- అత్యధిక మెజారిటీతో మర్రి జనార్దన్‌రెడ్డి.. అత్యల్పంతో వీఎస్‌ గౌడ్‌ గెలుపు
- నియోజకవర్గంలో 2,24,631 మంది ఓటర్లు



2014 ఎన్నికల్లో అభ్యర్థులవారిగా వచ్చిన ఓట్లు

ప్రధాన పార్టీల అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు
మర్రి జనార్దన్‌రెడ్డి	బీఆర్‌ఎస్‌	62,470
కూచకుళ్ల దామోదర్‌రెడ్డి	కాంగ్రెస్‌	48,035
నాగం శశిధర్‌రెడ్డి	బీజేపీ	27,789
అంతటి నాగయ్య	బీఎస్పీ	2,616

మొత్తం పోలైన ఓట్లు : 1,51,117

2018 ఎన్నికల్లో..

ప్రధాన పార్టీల అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు
మర్రి జనార్దన్‌రెడ్డి	బీఆర్‌ఎస్‌	1,02,493
నాగం జనార్దన్‌రెడ్డి	కాంగ్రెస్‌	48,139
ఎన్‌.దిలీపాచారి	బీజేపీ	3,923
సైమన్‌	స్వతంత్ర	5,545

మొత్తం పోలైన ఓట్లు : 1,68,581

నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు..

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
నాగర్‌కర్నూల్‌	32,165	32,294	1	64,460
బిజినేపల్లి	28,898	28,444	-	57,342
తెలకపల్లి	21,480	21,034	-	42,514
తిమ్మాజిపేట	15,820	16,051	1	31,872
తాడూరు	14,294	14,148	1	28,443
మొత్తం	1,12,657	1,11,971	3	2,24,631



1957 లోనూ ద్విసభ కావడంతో కాంగ్రెస్‌ తరఫున పి.మహేంద్రనాథ్‌ పోటీచేయగా ఆయనపై ఎలాంటి పోటీ లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండో అభ్యర్థిగా కాంగ్రెస్‌ తరఫున జనార్దన్‌రెడ్డి పోటీచేయగా ఇండిపెండెంట్‌గా బి.గుప్తా బరిలో నిలిచారు. ఇందులో కాంగ్రెస్‌ తరఫున పోటీ చేసిన జనార్దన్‌రెడ్డి 6,714 ఓట్లతో గెలుపొందారు.




1962 లో నాగర్‌కర్నూల్‌ ద్విసభ రద్దు కావడంతో ఈ ఎన్నికల్లో పుట్టపాగ మహేంద్రనాథ్‌ కాంగ్రెస్‌ తరఫున.. బీఎం రావు ఇండిపెండెంట్‌గా పోటీ చేశారు. దీంతో పుట్టపాగ మహేంద్రనాథ్‌ 1,507 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

1967 లో జరిగిన ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా వీఎస్‌ గౌడ్‌ పోటీచేయగా కాంగ్రెస్‌ తరఫున జనార్దన్‌రెడ్డి నిలబడ్డారు. ఇందులో వీఎస్‌ గౌడ్‌ 11,574 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.




1972 లో కాంగ్రెస్‌ తరఫున వీఎస్‌ గౌడ్‌ పోటీ చేయగా ఇండిపెండెంట్‌గా ఏఆర్‌ రెడ్డి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో వీఎస్‌ గౌడ్‌ ఏఆర్‌ రెడ్డిపై 2,435 ఓట్ల మెజారిటీతో ఎన్నికయ్యారు.

1978 లో ఎం.శ్రీనివాసరావు కాంగ్రెస్‌–ఐ తరఫున పోటీచేయగా వీఎస్‌ గౌడ్‌ కాంగ్రెస్‌ తరఫున పోటీచేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌– ఐ అభ్యర్థి శ్రీనివాసరావు 1,369 ఓట్ల మెజారిటీతో తన ప్రత్యర్థి వీఎస్‌ గౌడ్‌పై గెలుపొందారు.



1983 లో జరిగిన ఎన్నికల్లో వీఎస్‌ గౌడ్‌ కాంగ్రెస్‌ తరఫున పోటీ చేయగా నాగం జనార్దన్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా నిలబడ్డారు. ఇందులో ఎన్నికల్లో వీఎస్‌ గౌడ్‌ అత్యల్పంగా 52 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

1985 లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో నాగం జనార్దన్‌రెడ్డి టీడీపీ నుంచి.. కాంగ్రెస్‌ తరఫున వీఎస్‌ గౌడ్‌ పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో నాగం జనార్దన్‌రెడ్డి 14,667 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.



1989 లో జరిగిన ఎన్నికల్లో వీఎస్‌ గౌడ్‌ కుమారుడు వంగా మోహన్‌గౌడ్‌ కాంగ్రెస్‌ తరఫున పోటీచేయగా టీడీపీ తరఫున దైప గోపాల్‌రెడ్డి పోటీ చేశారు. ఇందులో వంగా మోహన్‌గౌడ్‌ దైప గోపాల్‌రెడ్డిపై 18,813 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.



1994 లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున నాగం జనార్దన్‌రెడ్డి, కాంగ్రెస్‌ తరఫున వంగా మోహన్‌గౌడ్‌ పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో నాగం జనార్దన్‌రెడ్డి సమీప ప్రత్యర్థి వంగా మోహన్‌గౌడ్‌పై 49,040 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

1999 లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున నాగం జనార్దన్‌రెడ్డి, కాంగ్రెస్‌ తరఫున వంగా మోహన్‌గౌడ్‌ పోటీచేయగా.. ఇండిపెండెంట్‌ అభ్యర్థిగా కూచకుళ్ల దామోదర్‌రెడ్డి పోటీ చేయగా నాగం జనార్దన్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన కూచకుళ్ల దామోదర్‌రెడ్డిపై 31,466 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

2004 లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున నాగం జనార్దన్‌రెడ్డి పోటీ చేయగా టీఆర్‌ఎస్‌ తరఫున కూచకుళ్ల దామోదర్‌రెడ్డి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో నాగం జనార్దన్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి కూచకుళ్ల దామోదర్‌రెడ్డిపై 1,449 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

2009 లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున నాగం జనార్దన్‌రెడ్డి పోటీ చేయగా.. కాంగ్రెస్‌ తరఫున కూచకుళ్ల దామోదర్‌రెడ్డి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో నాగం జనార్దన్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి కూచకుళ్ల దామోదర్‌రెడ్డిపై 6,593 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

2012 తెలంగాణ ఉద్యమ సమయంలో నాగం జనార్దన్‌రెడ్డి రాజీనామా చేయడంతో ఎన్నికల్లో మధ్యంతర ఎన్నికలు వచ్చాయి. ఇందులో నాగం జనార్దన్‌రెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీ చేయగా కాంగ్రెస్‌ తరఫున కూచకుళ్ల దామోదర్‌రెడ్డి పోటీ చేశారు. నాగం జనార్దన్‌రెడ్డి కూచకుళ్ల దామోదర్‌రెడ్డిపై 27,325 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

2014 లో జరిగిన సాధారణ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌ తరఫున మర్రి జనార్దన్‌రెడ్డి పోటీ చేయగా కాంగ్రెస్‌ తరఫున కూచకుళ్ల దామోదర్‌రెడ్డి పోటీ చేశారు. మర్రి జనార్దన్‌రెడ్డి కూచకుళ్ల దామోదర్‌రెడ్డిపై 14,435 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

2018 లో జరిగిన ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌ తరఫున మర్రి జనార్దన్‌రెడ్డి పోటీ చేయగా కాంగ్రెస్‌ తరఫున నాగం జనార్దన్‌రెడ్డి పోటీ చేశారు. దీంతో మర్రి జనార్దన్‌రెడ్డి నాగంపై 54,354 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. ఇప్పటి వరకు నాగర్‌కర్నూల్‌ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో ఇదే భారీ మెజారిటీ కావడం విశేషం.



విద్యార్థిని ఆత్మహత్య

ఆత్మకూర్‌: జీవితంపై విరక్తి చెందిన ఓ విద్యార్థిని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆత్మకూర్‌ మండలంలో చోటుచేసుకుంది. గద్వాల రైల్వే హెడ్‌కానిస్టేబుల్‌ రామకృష్ణ వివరాల మేరకు.. మండలంలోని దేవరపల్లికి చెందిన పూజిత (17) హైదరాబాద్‌లోని కీసర మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులంలో ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. దసరా సెలవుల్లో స్వగ్రామానికి వచ్చిన పూజిత.. తల్లి అనారోగ్యంతో బాధపడటం, తండ్రి దివ్యాంగుడు కావడంతో మానసికంగా కృంగిపోయింది. ఆదివారం అర్ధరాత్రి గ్రామ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్‌ తెలిపారు.

జూరాల కాల్వలో యువకుడి గల్లంతు

ఆత్మకూర్‌: దసరా సెలవుల్లో కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుదామని వచ్చిన ఓ యువకుడు జూరాల ప్రధాన ఎడుమ కాల్వలో గల్లంతైన ఘటన ఆత్మకూర్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేందర్‌ వివరాల మేరకు.. అమరచింతకు చెందిన గాజుల ఖాజామైనొద్దీన్‌, షీరిన్‌బేగం కుమారుడు జాఫర్‌ సమీ (21) హైదరాబాద్‌లోని సెంట్‌మేరీ కళాశాలలో బీబీఏ ఫైనల్‌ ఇయర్‌ చదువుతున్నాడు. మంగళవారం తల్లిదండ్రులతో కలిసి ఆత్మకూర్‌ శివారులోని జూరాల ప్రధాన ఎడుమ కాల్వ వద్దకు వచ్చాడు. కాల్వలో జాఫర్‌ మొఖం కడుక్కుంటూ ప్రమాదవశాత్తు నీటిలో పడి కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానిక యువకుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. జూరాల అధికారులతో మాట్లాడి నీటి ఉధృతి తగ్గించినా అతడి ఆచూకీ లభించలేదని ఎస్‌ఐ తెలిపారు.

మృతదేహం లభ్యం

పాన్‌గల్‌: వనపర్తి జిల్లా పాన్‌గల్‌ మండలం మల్లాయిపల్లి ఈదుల చెరువులో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ వేణు వివరాల మేరకు.. గ్రామ శివారులోని ఈదులచెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీశారు. అతడి వయసు 40–45 ఏళ్లు ఉంటాయని.. నలుపు రంగు మొఖం, బట్టతల, మొలతాడుకు నాగుపాము గుర్తు గల తయాత్తు ఉందని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని మార్చురీకి తరలించామని, వివరాలు తెలిస్తే పాన్‌గల్‌ పోలీసులకు (8712670616) సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

బాలుడిపై కుక్క దాడి

మిడ్జిల్‌: మండలంలోని వాడ్యాల్‌కు చెందిన అక్షయ్‌ (4) అనే బాలుడిపై సోమవారం రాత్రి కుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాలుడిని చికిత్స నిమిత్తం మిడ్జిల్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని, వాటి నుంచి చిన్నారులను కాపాడాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎర్రవల్లిచౌరస్తా: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఇటిక్యాల ఎస్‌ఐ అశోక్‌బాబు వివరాల మేరకు.. ఎర్రవల్లికి చెందిన పోతుల జయ్యన్న (35) కొండేరు నుంచి జాతీయ రహదారిపై నడుచుకుంటూ స్వగ్రామానికి వస్తుండగా, కర్నూల్‌ నుంచి హైదరాబాద్‌ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గద్వాల మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రూ.5.10 లక్షల నగదు సీజ్‌

వనపర్తి/కృష్ణా: వనపర్తి జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.4.39 లక్షల నగదు సీజ్‌ చేసినట్లు ఎస్పీ రక్షిత కె.మూర్తి తెలిపారు. మదనాపురం రైల్వేగేట్‌ వద్ద రూ. 3.50 లక్షలు, పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని కొల్లాపూర్‌ చౌరస్తాలో రూ.89వేల నగదును సీజ్‌ చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా కృష్ణా మండల సరిహద్దులోని చెక్‌పోస్టు వద్ద రూ.71వేల నగదు పట్టుకుని సీజ్‌ చేసినట్లు ఏఎస్‌ఐ సురేందర్‌ తెలిపారు.

27 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

ధరూరు: మండల కేంద్రంలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రాయచూర్‌ వైపు నుంచి గద్వాల వైపు మినీ డీసీఎంలో తరలిస్తున్న నల్లబెల్లాన్ని పట్టుకున్నారు. కర్ణాటక బాగల్‌కోట్‌ జిల్లా జంకండికి చెందిన డ్రైవర్‌ అక్షయ్‌, పరుశరాం పూజారి 270 బస్తాల్లో 27 క్వింటాళ్ల నల్లబెల్లం తరలిస్తుండగా, పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్‌ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

జోగుళాంబ క్షేత్రం.. భక్తి పరవశం



జోగుళాంబ దర్శనానికి బారులుదీరిన భక్తులు

- ఘనంగా దేవీ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- చివరి రోజున సిద్ధిధాత్రిగా అమ్మవారి దర్శనం
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

అలంపూర్‌/జోగుళాంబ శక్తిపీఠం: ఐదో శక్తిపీఠం, దక్షిణకాశీ అలంపూర్‌ క్షేత్రానికి సోమవారం భక్తులు పోటెత్తారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి నిర్వహించిన విశేష పూజా కార్యక్రమాల్లో పాల్గొని తన్మయం చెందారు. పది రోజులుగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న నవరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజున అమ్మవారు సిద్ధిధాత్రిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలకు ముగింపు పలుకుతూ ఆలయ నిర్వాహకులు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. యాగశాలలో పూర్ణాహుతి, త్రిశూల స్వామి, జోగుళాంబ అమ్మవారి నదీస్నానం, ధ్వజ అవరోహణ నిర్వహించారు. అనంతరం దీక్షాపరులు తమ దీక్షను విరమించారు. ఉత్సవాల చివరిరోజు ప్రాతఃకాలంలో జోగులాంబదేవిని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి తొలి దర్శనం చేసుకున్నారు.

అమ్మవారికి విశేష పూజలు

జోగుళాంబ అమ్మవారు చివరిరోజు సిద్ధిధాత్రిగా రూపంలో భక్తులచే విశేష పూజలు అందుకున్నారు. తిథుల్లో వచ్చిన మార్పులతో అమ్మవారిని సోమవారం సాయంత్రం సిద్ధిధాత్రిగా కొలువుదీర్చి సువాసిని, కుమారి పూజలు, మంత్రపుష్ప నీరాజనం, దశవిధ హారతులను అందజేశారు.

అవబృద స్నపనం..

నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని త్రిశూల సహిత బలిభేరి, జోగుళాంబ అమ్మవారి చక్రతీర్థావళి నయనానందంగా సాగింది. ఈ ఏడాది నదిలో నీరు తక్కువగా ఉండటంతో నాగకన్యకల బావి వద్ద అవబృద స్నపనం నిర్వహించారు. యాగశాల నుంచి ఆలయ చైర్మన్‌, ఈఓ, ధర్మకర్తలతో పాటు భక్తులు కలశాలు, నవధాన్యాలు, మొలకలతో, అర్చక స్వాములు జోగుళాంబ ఉత్సవమూర్తి, త్రిశూల సహిత బలిభేరిని మంగళ వాయుద్యాల నడుమ చక్రతీర్థ స్నానాలకై నాగకన్యకల బావి వద్దకు చేరుకున్నారు. అక్కడ గంగా పూజలు నిర్వహించారు. అనంతరం త్రిశూల సహిత బలిభేరి, జోగుళాంబమాతకు చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. ఆ జలాల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి పునీతులయ్యారు.



పూర్ణాహుతి సమర్పిస్తున్న పండితులు

పూర్ణాహుతితో పరిసమాప్తి..

యాగ పరిసమాప్తికి శుభ సూచకంగా నిర్వహించే పూర్ణాహుతిని ఘనంగా నిర్వహించారు. అవాహిత దేవతలకు ఉద్యాసన పలుకుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అర్చక స్వాములు తెలిపారు. ముందుగా ఆలయ ఈఓ పురేందర్‌కుమార్‌ దంపతులు, చైర్మన్‌ చిన్న కృష్ణయ్య నాయుడు, ధర్మకర్తలు యాగశాలలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జోగుళాంబమాత దీక్ష స్వాములు ఇరుముడులతో అమ్మవారి ఆలయం వద్ద ప్రదక్షిణ చేశారు. ఇరుముడులతో యాగశాలలో పూజలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం అర్చక స్వాములు మంగళ వాయిద్యాలతో యాగశాల ప్రదక్షిణ చేయగా, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

శమీ, ఆయుధ పూజలు..

విజయదశమిని పురస్కరించుకుని ఆలయంలో శమీవృక్షం వద్ద పురాతన ఖడ్గానికి ఆయుధ పూజలు నిర్వహించారు. అనంతరం ఈఓ పురేందర్‌కుమార్‌ ఖడ్గంతో శమి (జమ్మి) పత్రాన్ని ఛేదనం చేసి భగవంతుడికి సమర్పించారు. అదేవిధంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం, సాయంత్రం యోగ నరసింహస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు.

కనుల పండువగా తెప్పోత్సవం

ఉత్సవాల్లో భాగంగా రాత్రి తెప్పోత్సవం నిర్వహించారు. హంస వాహనంపై జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి తుంగభద్ర నదీ విహారం కనుల పండువగా సాగింది. విద్యుత్‌ దీపాల వెలుగులో సాగిన స్వామి, అమ్మవార్ల విహారం భక్తజనాన్ని కనురెప్ప వాల్చకుండా చేసింది. జోగులాంబ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులతో మంగళ వాయిద్యాల నడుమ పుష్కరఘాట్‌కు చేరుకున్నారు. అక్కడ గంగమ్మ పూజ, నవక పూజలు నిర్వహించారు. అనంతరం నవక నడిపే వారు కంకణ దీక్షలు స్వీకరించారు. జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామిని హంస వాహనంపై కొలువుదీర్చి అర్చక స్వాములు పంచసూక్తి పారాయణం, వేద పారాయణం, ఉపనిషత్‌ పారాయణం గావిస్తూ నదీ విహారాన్ని కొనసాగించారు. ఆది దంపతుల నదీ విహారాన్ని తిలకించడానికి భక్తులు వేలాదిగా తరలొచ్చారు. దీంతో పుష్కరఘాట్‌ జనమయంగా మారింది. పలువురు బాణాసంచా కాలుస్తూ సందడి చేశారు.



తెప్పోత్సవానికి హాజరైన భక్తులు

సాంకేతిక లోపం..

ఈ ఏడాది నదిలో నీళ్లు తక్కువగా ఉన్నాయి. వర్షాలు లేక డ్యాంలో సైతం నీళ్లు అడుగంటాయి. దీంతో ఆలయ నిర్వాహక అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ప్రతి ఏడాది వినియోగించే హంస వాహనం కాకుండా నీటికి అనుగుణంగా తెప్ప (హంస వాహనాన్ని) సిద్ధం చేశారు. యథావిధిగా ఆది దంపతుల విహార సమయంలో ఒకవైపు నీళ్లు తక్కువగా ఉండటం, మరోవైపు తెప్ప కోసం వినియోగించిన మర బోటు డీజిల్‌ ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో గజ ఈతగాళ్లు, పుట్టీలతో హంస వాహనాన్ని ముందుకు కదిలించారు. తెప్పోత్సవంలో స్థానిక జూనియర్‌ సివిల్‌జడ్జి కమలాపురం కవిత పాల్గొన్నారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పుష్కరఘాట్‌ వద్ద పూజలందుకుంటున్న ఆది దంపతులు



దేవతామూర్తులకు చక్రతీర్థ స్నానం నిర్వహిస్తున్న అర్చకులు



దేవతామూర్తులకు పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

ఎవరూ అధైర్యపడొద్దు.. బీఫాం మనకే


ఉండవెల్లి: అలంపూర్‌ బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా సీఎం కేసీఆర్‌ తనను ప్రకటించారని, ఈ మేరకు బీఫాం ఇస్తారన్న నమ్మకం ఉందని.. ఎవరూ అధైర్యపడొద్దని అలంపూర్‌ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మంగళవారం ఉండవెల్లిలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్‌ అభ్యర్థిత్వంపై కొందరు కావాలని లేనిపోని ప్రచారం చేస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్‌పై పూర్తి నమ్మకం ఉందని, తనకే బీఫాం వస్తుందని చెప్పారు. కాగా ఆర్డీఎస్‌కు నీళ్లు విడుదల చేయించాలని పలువురు ఎమ్మెల్యేను కోరగా, ఆర్డీఎస్‌ ఈఎన్‌సీకి ఫోన్‌ చేసి మాట్లాడారు. నీళ్లు లేక పంటలు దెబ్బతింటున్నాయని 2,100 క్యూసెక్కుల నీళ్లు విడుదల చేయాలని ఎమ్మెల్యే సూచించగా, సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు సురవరం లోకేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌ బజారన్న, వైస్‌ఎంపీపీ దేవన్న, రమణ, రఘురెడ్డి, జెడ్పీటీసీ రాజు, లింగారెడ్డి, వెంకటేశ్వర్లుగౌడ్‌, మజీద్‌మియా, మగ్బూల్‌, కురుమూర్తి, నరసింహ ఉన్నారు.



ఉండవెల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహం

ఎన్ని 'కలలో'..

కొత్త వరుసల జమ్మి



మావా.. జమ్మి వటు.. మా అల్లుడు, బిడ్డ ఉందా.. రమ్మను జమ్మి పెడతా.. పండగకు పిల్లలందరు వచ్చిండ్రా.. అయితే పెద్దోని జర అయినంక నా కాడికి రమ్మను.. ఇలా గ్రామాల్లో దసరా పండగ సందర్భంగా వరుసలతో వివిధ పార్టీల నాయకుల పలకరింపులు పులకరించాయి.. ఎక్కడ చూసినా వరసలతో పిలుస్తూ జమ్మి పెట్టి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కొత్త వ్యక్తులు వరులసతో పిలుస్తుండటంతో చిన్నారులు ఎవరబ్బ వీరు అని ఆశ్చర్యపోయారు. అన్నా మావోళ్లంత మన పార్టీ దిక్కే ఉన్నారు.. నిన్న ఆ పార్టీ వళ్లొచ్చి మాట కలిపితే మా పార్టీ ఎప్పటికీ ఒక్క దిక్కే అని చెప్పాం.. మాగేరి కాడికి వేరే వాళ్లను రనీవ్వం.. కాని మనోళ్లంత కరి పండగుంది.. జర ఎమ్మన్న చూడరాదే అంటున్నరు.... జర చూడన్నా అంటూ పార్టీ నేతలకు విపరీతమైన ఫోన్‌ కాల్స్‌.. ఎప్పుడు లేనిదీ ఎందుకు ఫోన్‌ కాల్స్‌ అంటే ఇంకేముంది ఎన్నికలు ఉన్నాయిగా.. అందుకే ఇలా జనం వాళ్ల నాయకులను పండగ కోసం ఫోన్లు చేశారు.

– నవాబుపేట